కానయితే— శాంతిలో ఆ మార్నాటి నుంచీ గిల్టీ కాన్షస్ ప్రారంభమయింది. వివాహ బంధానికి కట్టు పడకుండా తప్పు చేశానన్న సంఘర్షణ ఆమెని నిలువెల్లా ఊపెయ్యసాగింది. బలహీన క్షణంలో వర్మకి లొంగిపోయినా, భర్తకి ద్రోహం చేశానన్న ఆలోచన ఆమెలో ఇంతింతై వటుడంత అయింది!

భర్తతోనే తన వ్యధ చెప్పుకోవాలని నిర్ణయించుకుని— ఆ వీకెండ్‌లో గౌతమిలో కాకినాడ చేరింది!

ఆమె వెళ్ళేసరికి ఇల్లు తాళం పెట్టి ఉంది. అంత ఉదయాన్నే రాఘవ ఎక్కడికెళ్ళాడా అని ఆశ్చర్యపోతూ, తన దగ్గరున్న డూప్లికేట్ కీతో లోపలికి వెళ్ళింది
బెడ్‌రూమ్‌లో నలిగిన ప్రక్క మీద అక్కడక్కడా పడి ఉన్న మల్లెలు. ఆమె అటూ ఇటూ చూస్తూండగా కంగారుగా రాఘవ వచ్చాడు.

"ఏంటి, శాంతి? నువ్వా? ఇవాళ వచ్చేవేమిటి, ఎపుడూ లేనిది? ఏమిటలా చూస్తున్నావు. త్వరగా కాఫీ పెట్టవూ. తల పగిలిపోతోంది..." అంటూ హడావుడి బడుతూ తడబడుతు న్నాడు. ఎవరూ చెప్పక్కర్లేదు. అతని తడబాటే అతను చేసిన పనిని చెప్తోంది.

శాంతి అతనినేం అడగలేదు. చిత్రంగా ఆమెలో ఉన్న టెన్షన్ అంతా మాయమయిపోయింది. ఈయనా 'మారీడ్ బాచిలరే' అనుకుంది దీర్ఘంగా నిట్టూరుస్తూ!

యాంత్రికంగా తిరిగి హైదరాబాద్ చేరింది.

రెండు మూడు రోజులు పోయాక—

"మళ్ళీ ఎప్పుడు?" ఎవరూ వినకుండా శాంతితో గుసగుగా అన్నాడు వర్మ.

శాంతి కంగారుగా అటూ ఇటూ చూసింది.

"డోంట్ వర్రీ— ఐయామ్ ఆపరేటెడ్!" అన్నాడు చిలిపిగా.

"ఛీ!" అంది శాంతి.

"థాంక్యూ!" అన్నాడు వర్మ.

ఆమె ఎపుడు 'ఛీ' అని నవ్వుతూ అంటుందో అతనికి బాగా తెలుసు!

"తొమ్మిదికి వచ్చెయ్యి!"

"కాదు ఏడింటికే వస్తాను..."

శాంతి నవ్వింది. ఆ నవ్వులో ఎలాంటి తొట్రుపాటూ లేదు. ●

# ఐక్యత




ఆఫీసు నుంచి ఇంటికి రాగానే వాలుకుర్చీలో కూర్చున్నాడు రాజారావు. ఈ రోజు అతనికి చాలా ఆనందంగా ఉంది. 'తన చిరకాల వాంఛ త్వరలో నెరవేరబోతోంది. తమ ఆఫీసులో యూనియన్ సెక్రటరీ శ్రీధరరావును ఆ పదవి నుంచి దింపేయాలని చాలా రోజుల నుంచీ ప్రయత్నిస్తున్నాడు. ఒక్కొక్కరినీ మెల్లగా తన వైపు త్రిప్పుకొంటున్నాడు. ఈ రోజు జరిగిన రహస్య సమావేశంలో ఇరవై మంది వస్తే చాలు, తాను ధైర్యంగా ఎన్నికలు జరుపమని అడగవచ్చు. ఈసారి తాను సెక్రటరీ అయితే ఆ శ్రీధరరావును ముప్పుతిప్పలు పెట్టడం ఖాయం. వాడు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని పారిపోవడం ఖాయం.

రాజారావు కుర్చీలోంచి లేచి కళ్ళు, చేతులు కడుక్కొనేందుకు పెరటివైపు నడిచాడు. బాత్‌రూమ్ వైపు పోబోతూ, లోనుంచి మాటలు వినిపించి నిలబడిపోయాడు.

"ఏమండీ, ఎందుకు మీరిలా గుర్తింపులేని ఖర్చులన్నీ చేస్తారు. మీ అన్నలా మీరు నెలకింత అని యింటికి యిస్తున్నారు కదా. మళ్ళీ యిలా కూరగాయలు, నెయ్యి, మందులు అంటూ ఖర్చులు చేస్తూ పోతే చివరకు మన పిల్లలకేం మిగలదు. మీరు కాస్త బ్రతకడం నేర్చుకోండి."

"అలాగే లేవే. ఇకపై నెల మొదట్లో యిచ్చే డబ్బు యిచ్చేసి, ఆపై యింటికై నయాపైసా ఖర్చు చేయను. సరేనా."

తన రెండవ కొడుకు, కోడలు మాట్లాడుకొనే మాటలు యిక వినలేక, భార్యను కాఫీ అడుగుదామని వంటింటివైపు నడిచాడు. అక్కడ తన మూడవ కొడుకు తన భార్యతో మాట్లాడుతున్నాడు.

"అమ్మా! ఇక అన్ని పనులు చేయడం నా వల్లకాదు. వాళ్ళిద్దరిలా నాకు ఉద్యోగం లేనంత మాత్రాన నన్నో పనిమనిషిని చేసి యింటి చాకిరీ అంతా చేయించడం న్యాయం కాదు. నేనూ పరీక్షలకు చదువుకోవాలి. ఇకపై యింటి పని ముగ్గురూ సమానంగా పంచుకోవాలి. ఒక రోజు నేను కూరగాయలు తెస్తే, యింకో రోజు యింకొకరు తేవాలి. ఒక నెల నేను కరెంట్ బిల్ కడ్తే, యింకో నెల యింకొకరు కట్టాలి.

మనస్సు చివుక్కుమంది రాజారావుకు. దిగాలుగా మేడ మెట్లు ఎక్కసాగాడు. ఇంతలో అక్కడా మాటలు వినిపించి ఆగిపోయాడు.

"అయినా మీ తండ్రికి లేని బాధ్యతలు మీకెందుకండీ. ఎవరెటు పోతే మీకేం? నా మాట విని, నెలకింత అని యివ్వడం తప్ప యింకే విషయం లోనూ మీరు తల దూర్చకండి."

తన పెద్ద కోడలు తన కొడుకుకు చేస్తున్న హితబోధ విని, తిరిగి క్రిందకు వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు రాజారావు. కళ్ళు మూసుకొని ఆలోచనలో మునిగిపోయాడు. తను తన ఆఫీసులో అందరూ ఐకమత్యంగా ఉండటం యిష్టం లేక తన స్వార్థం కోసం, శ్రీధరరావును దింపడం కోసం ఆఫీసును రెండుగా చీల్చాడు. కానీ తన యింట్లోనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ ఇల్లు ఆదర్శవంతంగా ఉండాలనుకొన్నాడో ఆ ఇల్లే యిప్పుడు ముక్కలుగా చీలబోతోంది. రాజారావులో పశ్చాత్తాపం మొదలైంది. "అవును. ముందు తను తన యింట్లోని మనుషులకు మరమ్మతు చేయాలి. ఆపై శ్రీధరరావుకు దగ్గరై ఆఫీసులో పడిపోతున్న ఐక్యతను మళ్ళీ నిలబెట్టాలి."

ఇప్పుడు రాజారావు మనసు ప్రశాంతంగా ఉంది. — సి.ఎన్. చంద్రశేఖర్.